నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, గురువారం 19 సెప్టెంబర్ 2024 | MEDAK

సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలోని శనిగరం ప్రాజెక్టు

సంగారెడ్డి జిల్లా వట్‌పల్లిలో ఇటీవల కురిసిన వర్షాలకు నీట మునిగిన పత్తిపంట

# జలభాండాగారంగా మెతుకుసీమ

## ఫలించిన గులాబీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కృషి

- గోదావరి జలాలతో నిండుకుండల్లా రిజర్వాయర్లు
- ప్రాజెక్టులు లేని చోట రిజర్వాయర్ల నిర్మాణం
- రైతుల సాగు నీటి కష్టాలు తీర్చిన అపర భగీరథుడు కేసీఆర్
- ఆ ఫలాలు అందుకుంటున్న అన్నదాతలు
- కాళేశ్వరంపై కుట్రలు చేద్దామనుకున్న కాంగ్రెస్ ఆశలు అడియాశలు

సిద్దిపేట, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): సమైక్యరాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్మాణానికి తట్టెడు మట్టి కూడా నాటి ప్రభుత్వాలు ఎత్తలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ ప్రాంత రైతుల ఆత్మహత్యల నివారణకు సాగునీటి అవసరాలు తీర్చడం ఒక్కటే మార్గమని కేసీఆర్ భావించారు. తానే స్వయంగా డిజైన్ చేసి ప్రాజెక్టుల రూపకల్పన చేసి ఇవ్వాళ ఉమ్మడి మెదక్ జిల్లా రైతాంగానికి సాగు నీటిని తీసుకువచ్చి రైతుల కష్టాలు తీర్చిన నేత కేసీఆర్. ఎడారిగా ఉన్న మెతుకు సీమను సస్యశ్యామలం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం రాకముందు ఎలాంటి ప్రాజెక్టులు లేవు. కేసీఆర్ అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్ల నిర్మాణం చేశాడు. ఈ రిజర్వాయర్లు ఇవ్వాళ గోదావరి జలాలతో జలకళను సంతరించుకున్నాయంటే కేసీఆర్ చేసిన కృషి కండ్లముందు కనిపిస్తుంది. ఇవన్నీ కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే రికార్డు స్థాయిలో నిర్మాణం చేసి వినియోగంలోకి తీసుకువచ్చారు. ఇప్పుడు ఆ ఫలాలను రైతులు అనుభవిస్తున్నారు. ఇంత మంచి ప్రాజెక్టులను చూసిన కాంగ్రెస్

### రికార్డుస్థాయిలో రిజర్వాయర్ల నిర్మాణం

గులాబీ అధినేత కేసీఆర్ భగీరథ ప్రయత్నం చేసి కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా జిల్లాలో పెద్ద ఎత్తున రిజర్వాయర్లు నిర్మించారు. ఇవ్వాళ ఆ రిజర్వాయర్లు నిండుకుండలా జలకళను సంతరించుకున్నాయి. ఐదేండ్లుగా జిల్లా రైతాంగానికి ప్రతి ఏటా సాగునీరు అందించారు. దీంతో జిల్లాలో సాగు విస్తీర్ణం భారీగా పెరిగింది. ఫలితంగా భూమికి బరువయ్యేలా పంటలు పండిన విషయం తెలిసిందే. ఎక్కడో ఉన్న గోదావరి జలాలను కొండపోచమ్మ వరకు తీసుకువచ్చి ఉమ్మడి జిల్లా రైతుల గోస కేసీఆర్ తీర్చిండు. నాడు ప్రాజెక్టుల నిర్మాణం కాకముందు జిల్లాలో సాగునీటి కష్టాలు ఉండే, రైతుల ఆత్మహత్యలు ఉండే...కేసీఆర్ కృషి ఫలితంగా రైతులకు సాగునీటి కష్టాలు తీరాయి. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం రేవంత్ మొదలుకొని మంత్రుల వరకు ఇష్టానుసారంగా మాట్లాడారు. ఇవ్వాళ అదే కాళేశ్వరం ప్రాజెక్టు రైతులకు వరంగా మారిందన్న విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించింది.

సంగారెడ్డి జిల్లా పుల్‌కల్ మండలంలోని సింగూరు ప్రాజెక్టు

సిద్దిపేట జిల్లాలోని కొండ పోచమ్మ రిజర్వాయర్

ప్రభుత్వానికి కండ్లుమండినాయి. ప్రాజెక్టును నిర్వీర్యం చేద్దామనుకున్న కాంగ్రెస్ ప్రభుత్వ ఆశలు అడియాశలయ్యాయి. కేసీఆర్ చేసిన మంచి పనులు ఇవ్వాళ సజీవంగా ఉన్నాయి. వీటిని చెరిపితే చెడేవి కావన్న విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించాలని రైతులు సూచిస్తున్నారు.

### సిద్దిపేట జిల్లాలో రిజర్వాయర్లు ఇలా ...

అన్నపూర్ణ రిజర్వాయర్‌ను 3.5 టీఎంసీల సామర్థ్యంతో రాజన్నసిరిసిల్ల – సిద్దిపేట జిల్లాల సరిహద్దులో కేసీఆర్ ప్రభుత్వం నిర్మించింది. మిడ్‌మానేరు నుంచి తిప్పారం పంప్‌హౌస్ ద్వారా అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపోస్తున్నారు.ఈ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతున్నది. అక్కడి నుంచి నీటిని ఎత్తిపోసి సిద్దిపేట జిల్లాలోని రంగనాయకసాగర్‌ను నింపుతున్నారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చద్లాపూర్ వద్ద పంప్‌హౌస నిర్మాణం చేశారు. ఇక్కడ 134 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 4 మోటర్ల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నారు. ఐదేండ్ల నుంచి నిరంతరాయంగా నీటిని ఎత్తిపోస్తున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నీటిని ఎత్తిపోసి రిజర్వాయర్లను నింపుతున్నది. రంగనాయక సాగర్ నుంచి మల్లన్నసాగర్‌కు (తుక్కాపూర్ పంపుహౌస్) ద్వారా నీటిని ఎత్తిపోస్తారు. ఇక్కడ 43 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 8 మోటర్లు ఉన్నాయి. వీటి ద్వారానే మల్లన్నసాగర్‌లోకి నీటిని పంపింగ్ చేస్తారు. మల్లన్నసాగర్ నుంచి కొండపోచమ్మసాగర్‌కు మర్కూక్ పంప్‌హౌస్ ద్వారా నిటిని ఎత్తిపోస్తున్నారు.

### మల్లన్నసాగర్‌లో 19.90 టీఎంసీల నీళ్లు

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన రిజర్వాయర్లలో ఉత్తర తెలంగాణ వరప్రదాయిని మల్లన్నసాగర్ రిజర్వాయర్. దీని సామర్థ్యం 50 టీఎంసీలు కాగా ఇప్పటి వరకు మల్లన్నసాగర్‌లో నింపిన గోదావరి జలాలు అత్యధికం అని చెప్పవచ్చు. ఒక్క 2024–25 సీజన్‌లోనే నేటి వరకు 17.20 టీఎంసీల గోదావరి నీటిని మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లోకి పంపింగ్ చేశారు. ఈ నీటిలో 5.80 టీఎంసీలు కొండపోచమ్మసాగర్‌కు తరలించారు. మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లో ఇంతకుముందే ఉన్న 8.50 టీఎంసీల నీటికి అదనంగా ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 11.400 టీఎంసీల నీటిని నింపారు. ప్రస్తుతం మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లో 19.90 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇది ఇప్పటివరకు మల్లన్నసాగర్‌లో నింపిన అత్యధిక నీరు. అంతేకాకుండా రైతులకు వానకాలం, యాసంగి పంటలకు అవసరమైన సాగునీటిని అవసరాల నిమిత్తం, రైతు ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లో 21 టీఎంసీలను నిలువచేసే ఉద్దేశంతో ఈ ఎత్తిపోతల ప్రక్రియను ఈనెల 20వతేదీ వరకు కొనసాగించడానికి నిర్ణయం తీసుకున్నది. ఈ నీరు ప్రస్తుతం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా వస్తున్న వరదను మధ్యమానేరులో వడిసిపట్టి అన్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్ ద్వారా కేవలం మూడు చెల వత్తిపోతలతో రైతు ప్రయోజనాల కోసం రిజర్వాయర్లను నింపుతున్నారు.

### సింగూరుకు జలకళ

సంగారెడ్డి జిల్లాలోని సింగూరు జలకళను సంతరించుకుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పాటు ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు సింగూరు ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ఈ ప్రాజెక్టు సామర్థ్యం 29.91 టీఎంసీలు కాగా ప్రస్తుతం నీటి మట్టం 29.46 టీఎంసీల నీరు ఉంది. ఈ ప్రాజెక్టు ద్వారా సాగు, తాగునీటి కష్టాలు తీరనున్నాయి. ఈ జిల్లాలో దాదాపు 180 చెరువులకు పైగా మత్తళ్లు దుంకాయి. చాలా వరకు జిల్లాలోని చెరువులు నిండాయి. మంజీరా ప్రాజెక్టు సామర్థ్యం 1.50 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి మట్టం1.40 టీఎంసీలు ఉంది. నల్లవాగు ప్రాజెక్టు కూడా నిండుకుంది. మెదక్ జిల్లాలోని ఏడుపాయల వనదుర్గా ప్రాజెక్టు నిండుకుండలా ఉంది. దీంతో దీని పరీవాహక ప్రాంతంలో సాగుకు ఢోకా లేదు. ఇలా ఉమ్మడి మెదక్ జిల్లాలోని చిన్న, మధ్యతరహా ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి.

సిద్దిపేట జిల్లాలోని రంగనాయకసాగర్, మల్లన్నసాగర్ రిజర్వాయర్

# పత్తి రైతు కుదేలు

## భారీ వర్షాలకు సంగారెడ్డి జిల్లాలో 3,367 ఎకరాల్లో దెబ్బతిన్న పత్తి పంట

- వివరాల సేకరణలో నిమగ్నమైన వ్యవసాయ శాఖ అధికారులు
- మరింత నష్టం చేస్తున్న ఎండుతెగులు
- ఆదుకోవాలంటున్న రైతులు
- ఇతర పంటలు వందల ఎకరాల్లో నష్టం

సంగారెడ్డి, సెప్టెంబర్ 18(నమస్తే తెలంగాణ): భారీ వర్షాలకు సంగారెడ్డి జిల్లాలో అంచనాకు మించి పంటనష్టం జరిగింది. వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పంటనష్టం వివరాలు సేకరిస్తున్నారు. తొలుత కొద్దిగా పత్తి పంటనష్టం జరిగిందని భావించారు. 200 ఎకరాల నుంచి లొలుత పంట నష్టం జరిగిందని ప్రాథమికంగా అంచనా వేశారు. తీరా క్షేత్రస్థాయిలో సర్వే చేయగా 3367 ఎకరాలకు పత్తిపంట నష్టం చేరుకుంది. సర్వే పూర్తయ్యే వరకు నష్టం 7వేల ఎకరాలు దాటే అవకాశాలు కనిపిస్తున్నాయి. సంగారెడ్డి, సదాశివపేట, వట్‌పల్లి, మునిపల్లి, రాయికోడ్, జహీరాబాద్, న్యాల్‌కల్ తదితర మండలాల్లో పత్తిపంటకు ఎక్కువగా నష్టం వాటిల్లింది. ఆయా మండలాల్లో వ్యవసాయశాఖ అధికారులు పంటనష్టం వివరాలు ఇంకా సేకరిస్తున్నారు. దీంతో పత్తి పంటనష్టం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. పత్తితో ఇతర పంటలు దెబ్బతిన డంతో ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. పంటనష్ట పరిహారం చెల్లింపులో నిబంధనను పక్కనపెట్టి వర్షాలతో పంటదెబ్బతిన్న రైతులందరికీ ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

### అన్నిరకాల పంటలకు నష్టం...

సంగారెడ్డి జిల్లాలో వ్యవసాయశాఖ ఇప్పటి వరకు 5వేల మంది రైతులకు చెందిన 7369 ఎకరాల్లో పంటలకు నష్టం జరిగిందని గుర్తించింది. 120 ఎకరాల్లో పత్తి, 1271 ఎకరాల్లో సోయాబీన్, 1256 ఎకరాల్లో మినుము, 183 ఎకరాల్లో పెసర, 1059 ఎకరాల్లో కంది, ఏడు ఎకరాల్లో చెరుకు,106 ఎకరాల్లో కూరగాయల పంటకు నష్టం జరిగింది. వర్షాలతో అత్యధికంగా 2876 మంది రైతులకు చెందిన 3367 ఎకరాల్లో పత్తి పంట నష్టం జరిగింది. మునిపల్లి మండలంలో1034, వట్‌పల్లిలో 734, న్యాల్‌కల్‌లో 594, చౌటకూరులో 435, సదాశివపేటలో 127, సంగారెడ్డిలో 127, జహీరాబాద్‌లో 104, రాయికోడ్‌లో 97, పుల్కల్‌లో 36 ఎకరాల్లో పత్తి పంటకు నష్టం వాటిల్లింది. అధిక వర్షాలతో అందోలు, సంగారెడ్డి, జహీరాబాద్ నియోజకవర్గాల్లో పత్తిపంట నీట మునిగటంతో రైతులు నష్టపోయారు. తాజాగా ఎండుతెగులు పత్తి పంటను పట్టి పీడిస్తున్నది. ఎండుతెగులు కారణంగా పత్తిచెట్లు పూర్తిగా ఎండిపోయి రైతులకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. ఎండుతెగులుతో పత్తి పూత, కాయ రాలిపోవడంతో పాటు ఏకంగా చెట్లు ఎర్రగా మారి ఎండిపోయి నేలపై పడిపోతున్నాయి. పంటనష్టం ఎక్కువగా ఉన్న మండలాల్లో వ్యవసాయశాఖ అధికారులు పత్తిపంట నష్టం వివరాల సేకరణ ఇంకా కొనసాగిస్తున్నారు. దీంతో దీంతో పత్తిపంట నష్టం 7వేల ఎకరాలు దాటే అవకాశాలు ఉన్నాయి. అధిక వర్షాలు, తెగుళ్లతో పంట దిగుబడి సైతం గణనీయంగా తగ్గే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

### నష్టం వివరాలు సేకరిస్తున్నాం..

సంగారెడ్డి జిల్లాలో వర్షాలకు 3367 ఎకరాల్లో పత్తి పంట నీటమునిగింది. పత్తిపంట నష్టం వివరాల సేకరణ ఇంకా కొనసాగున్నది. భారీ వర్షాలకు పత్తి నీటమునగడంతో పాటు ఎండుతెగులు సోకి నష్టం వాటిళ్లుతున్నది. ఎండుతెగులు నివారణకు రైతులు నత్రజని, భాస్వరం, పొటాష్(19:19:19) ఉన్న పాలిపీడ్ ఎరువులు పత్తి పంటకు వేసుకోవాలి. కాపర్ ఆక్సీఫ్లోరైడ్ మందు ఒక గ్రాము లీటరు నీటిలో కలిపి పత్తిచెట్టు వేర్లు ఉన్నచోట పిచికారీ చేయాలి. కార్బెండజిమ్ –మాన్‌కోజెబ్ మందు ఒక గ్రాము లీటర్ నీటిలో కలిపి పత్తి చెట్టు వేర్లు మొదలులో పిచికారి చేయాలి.

– శివప్రసాద్, వ్యవసాయ శాఖ అధికారి, సంగారెడ్డి జిల్లా

స్పీకర్‌ను శాలువాతో సన్మానించి ఆశీర్వదిస్తున్న రంగంపేట పీఠాధిపతి మదనానంద సరస్వతి (ఇన్‌సెట్‌లో)స్పీకర్‌కు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

## రంగంపేట ఆధ్యాత్మిక పీఠాన్ని దర్శించుకున్న స్పీకర్

కొల్చారం, సెప్టెంబర్ 18: మెదక్ జిల్లా కొల్చారం మండలం రంగంపేటలోని మాధవానంద సరస్వతి ఆధ్యాత్మిక పీఠాన్ని శాసనసభా స్పీకర్ గడ్డం ప్రసాద్ దర్శించుకున్నారు. పీఠాధిపతి మధనానంద సరస్వతి చతుర్మాస్య దీక్ష విరమిస్తూ బుధవారం పౌర్ణమి సందర్భంగా ఆశ్రమంలో ప్రత్యేక పూజలు చేశారు. స్పీకర్‌కు మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. దర్శనానికి వచ్చిన స్పీకర్‌ను అర్చకులు వేదమంత్రాల నడుమ పూర్ణ కుంభంతో ఆహ్వానించారు. అనంతరం స్పీకర్ పీఠాధిపతి మదనానందస్వామి వారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన స్పీకర్‌ను సన్మానించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా స్వామి వారు మాట్లాడుతూ మహాశివరాత్రి మరుసటి రోజు సెలవు ప్రకటించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, కొల్చారం తహసీల్దార్ గఫార్ మియా, ఆర్ఐ ప్రభాకర్ ఉన్నారు.

**చాముండేశ్వరి అమ్మవారిని...**

చిలిపిచెడ్, సెప్టెంబర్ 18: మండలంలోని చిట్కుల్ శివారులో వెలిసిన చాముండేశ్వరి ఆలయంలో అమ్మవారిని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ దర్శించుకున్నారు. స్పీకర్ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

## పట్టపగలే చోరీ

- ఎనిమిది తులాల గొలుసుతో ఉడాయించిన దొంగ
- సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఘటన

సిద్దిపేట టౌన్, సెప్టెంబర్ 18 : బంగారం దుకాణంలో పట్టపగలే దొంగ చోరీకి తెగబడ్డాడు. ఈ సంఘటన సిద్దిపేట లాల్‌కమాన్ వద్ద చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ ఉపేందర్, బాధితుడు వివరాల ప్రకారం..పట్టణంలోని లాలాకమాన్ సమీపంలోని నయీమ్‌మియా బంగారు దుకాణంలో బుధవారం కస్టమర్‌గా వచ్చిన ఓ వ్యక్తి తనకు బంగారు గొలుసు కావాలని కోరాడు. గుమస్తా బంగారు గొలుసు చూపిస్తున్న క్రమంలోనే అందరూ చూస్తుండగానే ఎనిమిది తులాల బంగారు చైన్‌ను ఎత్తుకొని పారిపోయాడు. షాప్ యజమాని జునేద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా దుకాణంలోని సీసీ పుటేజ్‌లను పరిశీలించారు. త్వరలో నిందితుడిని పట్టుకుంటామని పట్టణ సీఐ ఉపేందర్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

## సాగునీటి సమస్య లేకుండా చూడాలి

దుబ్బాక, సెప్టెంబర్18 : దుబ్బాక నియోజకవర్గంలో రైతులకు సాగునీటి సమస్య లేకుండా చూడాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో బుధవారం నీటి పారుదలశాఖ, పీఆర్(పంచాయతీ రాజ్) శాఖల అధికారులతో వేర్వేరుగా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో డీఈలు బుచ్చయ్య, జీవన్, నరేశ్, బాలకృష్ణ, ఏఈలు ప్రసాద్, ప్రదీప్, ప్రకాశ్, సుమన్ పాల్గొన్నారు. అనంతరం నియోజకవర్గంలో బీటీ రోడ్ల రెన్యూవల్, కొత్త రోడ్లకు ప్రతిపాదనల కోసం పీఆర్‌శాఖ ఎస్ఈ రత్నం నేతృత్వంలో సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు.

### సీఎం రేవంత్‌రెడ్డి

## డైవర్షన్ రాజకీయాలు మానుకోవాలి

గజ్వేల్, సెప్టెంబర్18: సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ రాజకీయాలు మానుకోవాలని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పూటకో మాట, అబద్ధపు హామీలతో రేవంత్‌రెడ్డి కాలం గడుపుతున్నారని ఆరోపించారు. పోరాటాలు, ఉద్యమాలతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని గుర్తుచేశారు. ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు గులాం చేస్తూ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అడ్రస్ లేకుండా చేస్తున్న రేవంత్‌రెడ్డి సర్కారుకు తెలంగాణలో నూకలు చెల్లే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. పంట రుణమాఫీ కోసం రైతులు ఆఫీసర్ల చుట్టూ తిరగాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. రైతాంగం నానా అగచాట్లు పడుతుంటే సచివాలయం ఎదుట విగ్రహాల పేరుతో తెలంగాణ చరిత్రను చెరిపే కుట్రకు తెరతీశాడని ఆరోపించారు. ఎనిమిది నెలల్లో రూ.80 వేల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని మరింత దివాలా తీసేలా చేశారని మండిపడ్డారు. హైడ్రా పేరుతో హంగామా చేస్తున్న రేవంత్‌రెడ్డి కారణంగా హైదరాబాద్ వాసులకు కంటిమీద కునుకులేకుండా చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి దమ్ము, ధైర్యం ఉంటే ఎన్నికల హామీలు నెరవేర్చాలన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకోసం బీఆర్ఎస్ తరపున మరో ఉద్యమానికి శ్రీకారం చుడుతామన్నారు.

# పంట రుణమాఫీ చేయకుంటే సచివాలయం ముట్టడిస్తాం

- రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని లేవదీస్తాం
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి
- సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా

మిరుదొడ్డి, సెప్టెంబర్ 18 : పంట రుణమాఫీ చేస్తానని మాటిచ్చి తప్పిన సీఎం రేవంత్‌రెడ్డికి రైతులందరూ తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా మిరుదొడ్డిలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పంట రుణమాఫీ కాని 10 గ్రామాల్లోని 1000 మంది రైతులతో కలిసి తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పంట రుణమాఫీ కాని 780 మంది రైతుల జాబితాను డిప్యూటీ తహసీల్దార్ వీరేశ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఫోన్ ద్వారా మాట్లాడుతూ ఎన్నికల్లో సీఎం రేవంతర్‌రెడ్డి మాయమాటలు చెప్పి రైతులను మోసం చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోనే దుబ్బాక నియోజకవర్గం పూర్తిగా వ్యవసాయంపైనే ఆధారపడిందన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో పంటరుణమాఫీ కాని రైతులతో కలిసి కలెక్టరేట్ ముట్టడిస్తామన్నారు. రైతు భరోసాతోపాటు ఏ పథకం కూడా నేడు రైతులకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమ నాయకుడు కేసీఆర్ మిషన్ కాకతీయ పథకంలో చెరువుల పునరుద్ధరణ పనులు చేపట్టారు కానీ నేడు చెరువులు, కుంటలు పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయని ఆరోపించారు.

**సోయి తప్పి మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు**

రైతులకు రూ.2 లక్షల పంటరుణమాఫీ చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, కాంగ్రెస్ నాయకులు సోయి తప్పి మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి అన్నారు. రూ.2 లక్షల పంట రుణాలుమాఫీ చేశామని, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తన పదవికి రాజీనామా చేయాలంటూ కాంగ్రెస్ నాయకుడు చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఎగిరెగిరి పడుతున్నారంటూ మండిపడ్డారు. చెరుకు శ్రీనివాస్‌రెడ్డి నీవు జోకరుకు ఎక్కువ... లీడర్‌కు తక్కువ...నీవు హరీశ్‌రావుకు సవాల్ చేస్తావా...? నీ తుక్కాపూర్‌లోనే సగం మంది రైతులకు పంట రుణమాఫీ కాలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు పంట రుణమాఫీ అయ్యే వరకు గాంధీభవనలో కూర్చుంటావో.. సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి గేటు ఎదుట కూర్చుంటావో శ్రీనివాస్‌రెడ్డి రూ.2 లక్షల పంట రుణమాఫీ కాకుంటే రైతులు నిన్ను రాళ్లతో కొట్టి చంపుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు బాల్‌రాజు, బాల్‌నర్సయ్య, రైతు విభాగం మండల అధ్యక్షుడు దుర్గారెడ్డి, నాయకులు లింగం, హైమద్, ఐల్లయ్య, కిష్టయ్య, మల్లయ్య, కుమార్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.


సిద్దిపేట జిల్లా మిరుదొడ్డిలో డిప్యూటీ తహసీల్దార్ వీరేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రైతులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

### కేసీఆర్ ఉన్నప్పుడే మంచిగుండే..

కేసీఆర్ ఉన్నప్పుడే మంచి గుండే. రైతులకు ఏదంటే అది ఇచ్చిండు.. మంచిగ ఆదుకుండు. గీ కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి వచ్చిన తర్వాత ఏమీ చేస్తలేడు. నాకు పంటరుణమాఫీ కాలేదు, రైతుబంధు రాలేదు. రేవంత్‌రెడ్డి ఎందుకు వచ్చిండో తెలుస్తలేదు. కేసీఆర్ సార్ సల్లంగుండాలి. ఆయన రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించిండు. ఆయనే మళ్లీరావాలి

– కుర్మ మల్లేశం, రైతు, మిరుదొడ్డి, సిద్దిపేట జిల్లా

### లక్షా 30వేలు తీసుకున్నా మాఫీ కాలేదు

బ్యాంకు నుంచి రూ.లక్షా 30మేలు పంట రుణం తీసుకున్నా నాకు పంట రుణమాఫీ రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రులు అన్నిచెబుతున్నారే తప్పా ఏమి చేయడం లేదు. మాజీ సీఎం కేసీఆర్ రైతుల కోసం ఎన్నో పథకాలు తెచ్చిండు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో రైతులకు చెప్పిన మాటలు ఉత్తయే. రూ.2 లక్షల పంటరుణమాఫీ చేస్తానని చెప్పినా నాకు మాఫీ కాలేదు. ప్రభుత్వం పోతేనే రైతులకు మేలు జరుగుతది.

– లింగాల శివారెడ్డి, రైతు, మిరుదొడ్డి, సిద్దిపేట

హుస్నాబాద్ టౌన్: ప్రమాదంలో కాళ్లకు గాయాలైన పెద్దపల్లికి చెందిన ప్రవళిక, కుందనవానలిపల్లికి అర్చన, నాగారం రోడ్డులో టైరు పేలిన అద్దె బస్సు

# పేలిన ఆర్టీసీ అద్దె బస్సు టైరు

### నలుగురు ప్రయాణికులకు గాయాలు...కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలింపు

హుస్నాబాద్‌టౌన్, సెప్టెంబర్ 18: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో ఆర్టీసీ అద్దె బస్సు టైరు పేలిన ఘటనలో నలుగురు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల వివరాల ప్రకారం బుధవారం హుస్నాబాద్ బస్‌స్టేషన్ నుంచి రెండుగంటల 35 నిమిషాలకు టీఎస్02యూఏ 2602 నంబర్ గల ఆర్టీసీ అద్దె బస్సు కరీంనగర్‌కు బయలుదేరిన కొద్దిసేపటికే ఈ ప్రమాదం చోటుచేసుకుంది. స్థానిక నాగారం రహదారి వద్దకు బస్సు చేరగానే వెనుక టైరు ఒక్కసారిగా పేలింది. దీంతో టైరుగాలి ఒత్తిడికి రేకు చీల్చుకుని బస్సు లోపలికి చొచ్చుకురావడంతో ఆప్రాంతంలో కూర్చున్న మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. ఇందులో పెద్దపల్లికి చెందిన ప్రవళిక, అక్కన్నపేట మండలం కుందనవానలిపల్లికి చెందిన అర్చన కాళ్లకు తీవ్రగాయాలు కాగా, గోదావరిఖనికి చెందిన కల్యాణి, అక్కన్నపేట మండలం కుందనవాపల్లికి చెందిన శశిప్రియాంకలకు సైతం గాయాలయ్యాయి. టైరు పేలడంతో బస్సును నిలిపివేసి గాయపడిన వారిని స్థానికంగా ఒక ప్రైవేట్ దవాఖానకు తరలించి ప్రాథమిక చికిత్స చేయించారు. అనంతరం వారిని అంబులెన్స్‌లో కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రమాదం గురించి తెలుసుకున్న డీఎం వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం గురించి ఆరాతీసి గాయపడిన వారికి చికిత్స చేయించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు.

**ప్రమాదంపై మంత్రి పొన్నం ఆరా....**

హుస్నాబాద్ బస్సు ప్రమాదం ఘటనపై రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరా తీశారు. ప్రమాదానికి కారణం ఏమిటని, గాయపడిన వారికి చికి